

సస్పెండ్ చేసిన వారిని విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - విజయనగరం కోట

మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ పేరుతో అక్రమంగా సస్పెండ్ చేసిన ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చింతపల్లి సుందరయ్యతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 54మందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్‌వి రావు, ఎ.చంద్రయ్య, సభ్యులు కెఆర్ కుమార్, బిఎస్ రావు, బి.లక్ష్మి, ఎస్‌కె రాణి, జెఎస్ నారాయణ, సిహెచ్‌ఎస్ నాయుడు, ఎస్‌బి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

ఫుడ్‌కోర్టు భూముల వ్యవహారంలో రెవెన్యూ అధికారులకు తలనొప్పి

- 2018లో 70 ఎకరాలు కేటాయించిన అప్పటి ప్రభుత్వం
- అదే భూముల్లో 18 ఎకరాలు నివాస గృహాల కోసం నేడు కేటాయింపు
- మిగతా డి-పట్టా భూముల రైతుల పేరిట ఫ్రీ హోల్డ్ పట్టాలు
- న్యాయస్థానాన్ని ఆశ్రయించిన ఫుడ్ కోర్టు సంస్థ

ప్రజాశక్తి-భోగాపురం

ఏదైనా సంస్థ కంపెనీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం భూములు ఇచ్చేటప్పుడు ఆ సంస్థ సకాలంలో ఆ భూములను ఉపయోగించకపోయినా లేదా ప్రభుత్వ ధరకు సొమ్ము చెల్లించకపోయినా ఆ సంస్థకు ఆ భూములను రద్దు చేసి వేరే వారికి కేటాయించాలి. కాని మండలంలోని తూడెం పంచాయతీ బసవపాలెం రెవెన్యూ పరిధిలో ఆరేళ్ల కిందట ఫుడ్‌కోర్టు సంస్థకు కేటాయించిన 70 ఎకరాల భూముల వ్యవహారంలో ఆ సంస్థకు భూములను రద్దు చేయకుండా అధికారులు గుడ్డిగా మరో సంస్థకు కేటాయించేశారన్న ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. ఇప్పుడు ఈ వ్యవహారం జిల్లాలోని రెవెన్యూ అధికారులకు తలనొప్పిగా మారింది. ఆ సంస్థ సకాలంలో ముందుకు రాకపోవడంతో విమానాశ్రయానికి, భద్రత సిబ్బంది నివాస గృహాలు నిర్మాణానికి 18ఎకరాలు ప్రభుత్వ భూమిని ఇటీవల జిఎంఆర్ సంస్థకు కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా మిగిలిన 52 ఎకరాల్లో డి-పట్టా భూములు ఉండగా వాటికి కూడా ఫ్రీ హోల్డు పట్టాలు ఇచ్చేశారు. ఫుడ్ కోర్టు సంస్థకు కావాలనే ఈ భూములను ఇవ్వకుండా మాజీ సిఎస్ జవహర్ రెడ్డికి లబ్ధి చేకూర్చేందుకు ఆయన బినామీలు కొనుగోలు చేశారని ఇటీవల విశాఖ జనసేన కార్పోరేటర్ మూర్తి యాదవ్ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఈ వ్యవహారంపై ఏం చేయాలో తెలియక రెవెన్యూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

మండలంలోని బసవపాలెం రెవెన్యూ పరిధిలో 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వం ఫుడ్ కోర్టు సంస్థకు ఎపిఐఐసి ద్వారా 70 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించింది. ఇందులో 18 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా మరో 52 ఎకరాలు రైతులకు ఇచ్చిన డి- పట్టా భూములు ఉన్నాయి. ఇందుకు ఆ సంస్థ డి-పట్టాలకు ఎకరా రూ.12.50లక్షలు చొప్పున, ప్రభుత్వ భూమికి ఎకరాకు రూ.5లక్షలు చొప్పున చెల్లించేందుకు అప్పట్లో నిర్ణయించినట్లు తెలిసింది. ఇటీవల ఈ 70 ఎకరాల్లోని 18 ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు మరో 3ఎకరాలు


ఫుడ్ కోర్టు సంస్థకు కేటాయించిన భూములను చదును చేసిన జిఎంఆర్ సంస్థ

ప్రభుత్వ భూమిని కలిపి 21ఎకరాలు విమానాశ్రయ భద్రతా సిబ్బంది అయిన సిఐఎస్ఎఫ్ నివాస గృహాల నిర్మాణానికి జిఎంఆర్ సంస్థకు ఆరు నెలలు కిందట కేటాయించారు. ఈ ప్రభుత్వ భూముల్లో గత వంద సంవత్సరాల నుంచి రైతులు జీడి తోటలు వేసుకొని జీవనం సాగిస్తున్నప్పటికి రూపాయి కూడా నష్ట పరిహారం ఇవ్వకుండా జిఎంఆర్ సంస్థ ఈ భూముల్లో చెట్లను దౌర్జన్యంగా తొలగించి భూములను స్వాధీనం చేసుంది. అంతేకాకా మిగతా 52 ఎకరాల్లోని సుమారు 30 ఎకరాలు డి-పట్టా భూములకు ఫ్రీ హోల్డ్ పట్టాలను రెవెన్యూ అధికారులు ఇచ్చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఫుడ్‌కోర్టు సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. మాజీ సిఎస్ జవహర్‌రెడ్డి బినామీలు ఈ డి-పట్టా భూములు కొనుగోలు చేయడంతో రెవెన్యూ అధికారులు ఫ్రీ హోల్డ్ పట్టాలు ఇచ్చారని ఇటీవల విశాఖలో జరిగిన విలేకరుల సమావేశంలో మూర్తి యాదవ్ ఆరోపించారు.

ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం వలనే

ఉన్నతాధికారులు వ్యవహరించిన తీరువలనే ఈ భూముల వ్యవహారం తలనొప్పిగా మారిందని కొంత మంది అధికారులు అంటున్నారు. గతంలో ఫుడ్ కోర్టు సంస్థ సకాలంలో స్పందించక పోవడంతో గత కలెక్టర్ హరి జవహర్‌లాల్ ప్రభుత్వానికి ఈ భూములపై లేఖ రాశారు. అక్కడ నుంచి సిసిఎల్ దృష్టికి తీసుకువెళ్ల డంతో అక్కడ నుంచి ఎపిఐఐసి ద్వారా ఆ ఫుడ్‌కోర్టు సంస్థ ముందుకు రావాలని సూచించింది. కొంత సమయం కావాలని ఆ సంస్థ కోరడంతో అక్కడితో ఈ వ్యవహారం నిలిచిపోయింది. జిల్లాకు వచ్చేసరికి ఈ భూములను ఫుడ్ కోర్టు సంస్థకు రద్దు చేశారనే ఉద్దేశంతో జిల్లా అధికారులు జిఎంఆర్ సంస్థకు భూమిని కేటాయించడంతో పాటు రైతులకు ఫ్రీ హోల్డు పట్టాలను ఇచ్చేశామని అధికారులు చెబు తున్నారు. ఆ సంస్థ కోర్టును ఆశ్రయించడంతో అసలు వ్యవహారం బయటపడింది.

మూతపడిన ఆర్‌సిఎం పాఠశాలలు

- ప్రభుత్వ సహకారం లేకపోవడమే కారణం
- 89మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం
- కంటోన్మెంట్ స్కూలుకు రికార్డులు అప్పగింత


మూతపడిన సెయింట్ ఆంథోని ఉన్నత పాఠశాల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

57ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగి ఎంతోమంది మేధావులను, విద్యావంతులను, అందించిన అర్‌సిఎం ఎయిడెడ్ పాఠశాలలు ఈ విద్యా సంవత్సరం నుంచి మూతపడ్డాయి. ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలల నిర్వహణ యాజమాన్యాలు నిర్ణయానికి విడిచిపెట్టడంతో అర్‌సిఎం యాజమాన్యం నగరంలో ఉన్న కంటోన్మెంట్ ప్రాంతంలో సెయింట్ జోసెఫ్ స్కూల్‌ను ఆనుకొని ఉన్న ప్రాథమిక, ఉన్నత పాఠశాల(సెయింట్ ఆంథోని హైస్కూలు) లను ఈ విద్యా సంవత్సరం నుంచి మూసివేస్తున్నట్లు ప్రకటించింది. యాజమాన్యం నిర్ణయంతో ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 30 మంది విద్యార్థులు, ఉన్నత పాఠశాలలో చదువుతున్న 59 మంది విద్యార్థులు వేరే పాఠశాలలకు మారాల్సిన పరిస్థితి నెలకొంది.

1966లో విజయనగరంలో అర్‌సిఎం ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలు ఏర్పాటయ్యాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పేద పిల్లలకు విద్యను అందించాలనే ఉద్దేశంతో క్రిస్టియన్ మైనార్టీ సంస్థలు భవనాలు నిర్మించి, మౌలిక సదుపాయాలు కల్పించి పాఠశాలలను ఏర్పాటు చేశాయి. ఆ విధంగా విజయనగరం జిల్లా కేంద్రంలో అర్‌సిఎం సంస్థతో పాటు, మాన్సాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాలలు, కాలేజీలు ఏర్పాటు జరిగింది. అందులో భాగంగానే అర్‌సిఎం సంస్థ 1966లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేసింది. ఎయిడెడ్ పాఠశాలల నిర్వహణను ప్రభుత్వం యాజమాన్యాలకే వది లేయడంతో పాఠశాలల మూసివేతకు కారణమైంది. ఎంతో మంది పేద, బడుగు బలహీనవర్గాలకు విద్యా బుద్ధులు నేర్పించి వందల సంఖ్యలో వివిధ స్థాయిల్లో స్థిరపడడానికి నిలయంగా మారిన అర్‌సిఎం పాఠశాలలు మూతబడడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు విస్మయం వ్యక్తం చేశాయి. ప్రభుత్వాలు నూతన విద్యావిధానం అమలు చేసిన తర్వాత చరిత్ర కలిగిన ఎయిడెడ్ విద్యా సంస్థలు ఏడాదికేడాది మూతపడుతూనే ఉన్నాయి. ప్రభుత్వం ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేయడంతో ఈ దుస్థితి నెలకొంది. ఇప్పటికే మాన్సాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హైస్కూల్‌ను ఐదేళ్ల క్రితం మూసివేయగా, కాలేజి అటానమస్‌గా మార్పు చేసింది. తాజాగా అర్‌సిఎం పాఠశాలలు మూతపడ్డాయి. దీంతో ఈరెండు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఇతర పాఠశాలలకు వెళ్లిపోతున్నారు. కొంతమంది బడికి వెళ్లేందుకు ఇష్టపడకుండా ఇళ్ల వద్దనే ఉండిపోతున్నారు.

ప్రభుత్వం నిర్లక్ష్యమే మూతకు కారణం

ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోవడం, పాఠశాలకు రావాల్సిన ఎయిడ్ గ్రాంట్ నిధులు మంజూరు చేయకపోవడం వలన ఎయిడెడ్ పాఠశాలలు మూతపడటానికి ప్రధాన కారణం. ప్రభుత్వాలు ఎయిడెడ్ విద్యా సంస్థల పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. ఈనేపథ్యంలోనే ఆర్‌సిఎం పాఠశాలలో విశాలమైన మైదానం, తరగతి గదులు, అని సౌకర్యాలు ఉన్నప్పటికీ నిర్లక్ష్యానికి గురైంది. ఉపాధ్యాయులు లేకపోవడం, విద్యార్థులకు బోధన వంటి సమస్యలు రావడంతో ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని పాఠశాలలను యాజమాన్యాలు మూసివేశాయి.

కంటోన్మెంట్ పాఠశాలకు రికార్డుకు బదిలీ

అర్‌సిఎం పాఠశాలలు ఈ విద్యా సంవత్సరం నుంచి మూసేయడంతో పాఠశాల రికార్డులు స్థానిక మున్సిపల్ కంటోన్మెంట్ హై స్కూల్‌కు అప్పగించారు. ప్రాథమిక పాఠశాలలో ఉన్న ముగ్గురు ఉపాధ్యాయులను, ఉన్నత పాఠశాలలో ఉన్న ఆరుగురు ఉపాధ్యాయులను వివిధ పాఠశాలలకు బదిలీ చేశారు.


పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

ప్రారంభమైన పాఠశాలలు

50 శాతం దాటని విద్యార్థుల హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు గురువారం తెరుచుకున్నాయి. పాఠశాల మొదటి రోజు కావడంతో హాజరైన విద్యార్థుల సంఖ్య 50శాతం దాటలేదు. సుమారు 50రోజులు పాటు ఆటపాటలతో గడిపిన విద్యార్థులు పాఠశాలలు ప్రారంభం కావడంతో స్కూల్‌బ్యాగ్‌లు పట్టుకొని ఆటోల్లో, సైకిళ్లపైనా, నడచుకుంటూ పాఠశాలలకు చేరుకున్నారు. మొదటి రోజు కావడంతో విద్యార్థులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంతో పేర్లు నమోదు, తరగతి ఉన్నతి, విద్యార్థులు ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ మొదటిరోజు గడిపారు. సోమవారం నుంచి పూర్తి స్థాయిలో పాఠశాలలకు విద్యార్థులు హాజరయ్యే అవకాశం ఉంది.

విత్తన పంపిణీకి శ్రీకారం

- అన్నదాతలకు అండగా ఉంటామన్న ఎంపి, ఎమ్మెల్యే
- ఘన స్వాగతం పలికిన జొన్నవలస ప్రజలు

ప్రజాశక్తి - విజయనగరం కోట

రుతుపవనాల పలకరింపుతో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన వేళ ప్రభుత్వం విత్తన పంపిణీకి శ్రీకారం చుట్టింది. జిల్లాలో తొలిసారిగా స్థానిక ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చేతులమీదుగా జొన్నవలస రైతు భరోసా కేంద్రం వద్ద వరి, తదితర వ్యవసాయ విత్తనాలను గురువారం పంపిణీ చేశారు. తొలిసారిగా ప్రజాక్షేత్రంలోకి వెళ్లడంతో కేంద్ర మాజీమంత్రి అశోక్ గజపతిరాజు ఆశీస్సులు తీసుకొని బయలుదేరారు. విత్తన పంపిణీ అనంతరం ఎంపీ కలిశెట్టి మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అన్నదాతలకు అండగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉండాలంటూ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. వివిధ పంటల సాగుపై ఎంపీ నేరుగా యాజమాన్య పద్ధతులను వివరించడం పట్ల రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇందుకు ఎంపీ స్పందిస్తూ తాను కూడా రైతు బిడ్డనేనని, రైతులకు టిడిపి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందనడానికి తన రాజకీయ జీవితం ఉదాహరణ అని పేర్కొన్నారు. జిల్లాలో విత్తనం, ఎరువుల సమస్య ఉంటే నేరుగా కేంద్రంతో మాట్లాడుతానని చెప్పారు. అధికారులు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఎమ్మెల్యే అదితి గజపతి మాట్లాడుతూ రైతులకు అధికారులు సమయానుకూలంగా అందుబాటులో ఉండి సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలని సూచించారు. రైతులకు కావలసిన సలహాలు, సూచనలు అధికారులు ఎప్పటికప్పుడు అందించాలని సూచించారు. అదును దాటాక విత్తనాలు పంపిణీ చేస్తే ఉపయోగం ఉండబోదని, సకాలంలో అందించినప్పుడే రైతుకు మేలు చేకూరుతుందని అన్నారు. తమది ప్రజా ప్రభుత్వమని, రైతులే కీలకమని తెలిపారు రైతులకు, ప్రజలకు ఏ సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సచివాలయం సిబ్బంది


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి

ఎంపీ, ఎమ్మెల్యేలను ఘనంగా సత్కరించారు. దీనికి ముందుకు స్థానిక ఎంపిటిసి సభ్యులు రాజేష్‌బాబు ఆధ్వర్యాన గ్రామస్తులంతా ఎంపీ, ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విటి రామారావు, వ్యవసాయశాఖ ఎడిఎ నాగభూషణం, మండల వ్యవసాయాధికారి ఉమామహేశ్వర నాయుడు, డిపిఎం ఎపిసిఎంఎఫ్ ఆనందరావు, ఎపి సీడ్స్ జిల్లా మేనేజర్ పద్మ, డిసి ఎల్ మాజీ డైరెక్టర్ రాజు, ఎంపిటిసి సభ్యులు రాజేష్ బాబు, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, పిల్లా విజయ్ కుమార్, కాళ్ల గౌరీ శంకర్, కర్రోతు నర్సింగరావు, వేచలపు శ్రీనివాసరావు, పాచిల అప్పలనాయుడు, విజయనగరం పార్లమెంట్ మహిళా అధ్యక్షులు అనురాధ బేగం, రైతులు పాల్గొన్నారు.

ఇఎంఎస్‌కు నివాళి

ప్రజాశక్తి - సాలూరు

దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత ఇఎంఎస్ నంబూద్రిపాద్ జయంతి సందర్భంగా గురువారం సిపిఎం పట్టణ కమిటీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వైనాయుడు మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టు, కార్మిక ఉద్యమాల నిర్మాణంలో ఇఎంఎస్ నంబూద్రిపాద్‌ది చెరగని ముద్ర అని అన్నారు. 1931లోనే కళాశాల విద్య ఆపేసి కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో పాల్గొన్నారని తెలిపారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు టి.రాముడు, స్వప్న, భాస్కరరావు పాల్గొన్నారు.


ఇఎంఎస్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సిపిఎం నాయకులు

పోరాటంతోనే హక్కులు సాధించుకోవాలి

- జిందాల్ పరిశ్రమను భేషరతుగా తెరవాలి
- ఎపిరైతు సంఘం ఉపాధ్యక్షులు మర్రాపు

ప్రజాశక్తి-కొత్తవలస

జిందాల్ కార్మికులు పోరాటం ద్వారానే తమ హక్కులు సాధించుకోవాలని, యాజమాన్యం తీరులో మార్పు వచ్చేంత వరకు ఐక్యతతో ఉండాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మరాపు సూర్యనారాయణ అన్నారు. గురువారం ఆయన జందాల్ కార్మికులు పోరాటం చేస్తున్న శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భేషరతుగా ఫ్యాక్టరీ తెరిచేంతవరకు ఐక్యతతో ఉండి పోరాడాలని పిలుపు నిచ్చారు. కార్మికులకు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా యాజమాన్యం లే ఆఫ్ ప్రకటించడం విచారకరమని అన్నారు. ఇటువంటి పరిణామాలు ఎక్కడా జరగలేదని, లే ఆఫ్ ప్రకటించే ముందు కార్మికులకు విషయం తెలియపరచాలని అన్నారు. కార్మికుల సహనాన్ని యాజమాన్యం పరీక్షిస్తుందన్నారు. యాజమాన్యం దిగి వచ్చే వరకు, పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. వ్యవసాయ రంగంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని రైతాంగానికి ప్రభుత్వం నుంచి రావలసిన రాయితీలు అందేలా కృషి చేసిన సంఘటనలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. మన ఆయుధం పోరాటమేనని, ఐక్యతతో మనమంతా పోరాడితే యాజమాన్యం దిగి రావాల్సిందేనని అన్నారు. కర్మాగారంలో ఏ ఒక్క కార్మికునికి అన్యాయం జరిగినా ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. జిందాల్ పరిశ్రమ మూసివేసిన విషయం స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి దృష్టికి తీసుకువెళ్లి పరిశ్రమ తెరిపించడానికి కృషి చేస్తామని



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న మర్రాపు సూర్యనారాయణ

సూర్యనారాయణ అన్నారు. జిందాల్ యాజమాన్యం సరైన సమయంలో స్పందించకపోతే ఈ ప్రాంత ప్రజలను చైతన్య పరచి, పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు, సిఐటియు నాయకులు నమ్మి చినబాబు, బాలిబోయిన ఈశ్వరరావు, టిఎన్‌టియుసి నాయకులు పిల్లా అప్పలరాజు, సలాది భీమయ్య, వైఎస్ఆర్ టియుసి నాయకుడు లగుడు వామాలు, భూసాల అప్పారావు, జిడి నాయుడు, బి.వెంకటరావు కార్మికులు పాల్గొన్నారు.

యాజమాన్యంతో చర్చలు విఫలం

జిందాల్ యాజమాన్యంతో మరో మారు జరిగిన చర్చలు విఫలమయ్యాయి. గురువారం జిందాల్ యాజమాన్యం కార్మిక నాయకులను చర్చలకు పిలిచింది. ఈ చర్చల్లో జిందాల్ జిఎం దినేష్ శర్మ, డిజిఎం గోపాలకృష్ణ హాజరు కాగా, కార్మికుల నుంచి వైఎస్ఆర్‌టియుసి నాయకుడు నెక్కల నాయుడు బాబు, లగుడు వామాలు, సిఐటియు నుంచి నమ్మి చినబాబు, బాలిబోయిన ఈశ్వరరావు, టిఎన్‌టియుసి నుంచి పిల్లా అప్పలరాజు, సలాదిభీమయ్య తదితరులు హాజరయ్యారు. నెలలో 15 రోజులు కార్మికునికి పని కల్పిస్తామని యాజమాన్య ప్రతినిధులు తెలపగా కార్మికులంతా వ్యతిరేకించి చర్చలు నుంచి బయటకు వచ్చేశారు.

నిలిచిపోయిన నాడు-నేడు రెండోదశ పనులు

- పాఠశాలల్లో అరకొర తరగతి గదులు
- పనులు ఎప్పటికి పూర్తయ్యేనో?
- ఇబ్బందులు పడనున్న విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రారంభించిన మనబడి నాడు-నేడు కార్యక్రమం నిధుల కొరతతో పడకేసింది. ఈ నేపథ్యంలో రెండోదశ పనులు అస్తవ్యస్తంగా మారాయి. పేరుకు ప్రతిష్ఠాత్మక కార్యక్రమమే అయినా నిధుల విడుదలలో మాత్రం చిట్టచివర నిలవడంతో చాలాచోట్ల పనులు ఆగిపోయాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 737 పాఠశాలల్లో రూ.231.24 వేల కోట్ల అంచనాతో నాడు-నేడు రెండో విడత పనులను 2021 ఆగస్టులో ప్రారంభించారు. మూడేళ్ల దాటిపోయినా ఇప్పటివరకూ విడుదల చేసిన నిధులు కేవలం రూ.49.59 కోట్లే. మిగిలిన నిధుల విడుదలకు ఎంతకాలం పడుతుందో తెలియని పరిస్థితి కనిపిస్తోంది. వైసిపి ప్రభుత్వం ఓడిపోయి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సిందే.

నిధుల విడుదలలో వైఫల్యం

నాడు-నేడు నిధులు గత మూడేళ్లుగా విడుదల చేయకుండా వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ప్రపంచ బ్యాంకు నుంచి కొంతమేర రుణాన్ని సమీకరించి 20 శాతం వరకు నిధులు విడుదల చేశారు తప్ప పూర్తి స్థాయిలో ఇవ్వలేదు. ఇలా వివిధ రూపాల్లో సమీకరిస్తున్నా సక్రమంగా నిధులు విడుదల చేయడంలో వైసిపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఇటీవల మెటీరియల్ ధరలు భారీగా పెరిగిపోవడంతో ప్రభుత్వం


నిర్మాణ మధ్యలో నిలిచిపోయిన బిపిఎం హై స్కూల్ భవనాలు

అరకొరగా ఇస్తున్న నిధులు ఏమూలకూ సరిపోవడం లేదు. నిధులు విడుదల కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో పాఠశాలల్లో వసతుల కొరత వెంటాడుతోంది. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది.

విజయనగరం జిల్లా కేంద్రంలోని బాబామెట్టలో ఉన్న బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వసతులు చాలని కారణంగా 15 గదులు అదనంగా నిర్మించేందుకు నాడు-నేడు కార్యక్రమం కింద రూ.1.74 కోట్లతో పరిపాలన ఆమోదం ఇచ్చారు. మొదటి విడతగా రూ.35.6 లక్షలు విడుదల చేశారు. ఈ నిధులు ఉన్నంత వరకు నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో మిగిలిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. జిల్లాలో 737 పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఎప్పటికి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందో, ఎప్పటికి రెండో విడత నాడు-నేడు పనులు పూర్తి అవుతాయో కొత్త గా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఏమి చేస్తుందో వేచి చూడాల్సిందే.

25 శాతానికి మించి జరగని పనులు

2021 ఆగస్టులో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మనబడి నాడు - నేడు కార్యక్రమం రెండో విడత పనులకు శ్రీకారం చుట్టారు. 2022 జూలై నాటికి పనులు పూర్తిచేస్తామని అప్పట్లో ప్రకటించారు. అయితే పరిపాలనా అనుమతులు ఇచ్చేందుకే సుమారు ఏడాది సమయం పట్టింది. ఇప్పటివరకు కేటాయించిన నిధులతో 25శాతం పనులు మాత్రమే జరిగాయి. 2024 విద్యా సంవత్సరం వచ్చింది. రాష్ట్రంలో ప్రభుత్వం కూడా మారిపోయింది. అయినా నిధులు విడుదల చేయలేదు. ఇప్పటివరకూ విడుదల చేసిన నిధులతో పనులు చేసిన ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీల సభ్యులు రావాల్సిన వాటి కోసం ఎదురుచూస్తున్నారు.

పునాదులకే పరిమితం

- ఎక్కడికక్కడ నిలిచిపోయిన నాడు నేడు పనులు
- పాఠశాలలు పున: ప్రారంభం నుంచే విద్యార్థులకు అవస్థలు

ప్రజాశక్తి - వంగర

గత వైసిపి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు నేడు పేజ్ టు పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కొన్ని చోట్ల పునాదులకే పరిమితమయ్యాయి. నిధులు సకాలంలో అందక కాంట్రాక్టర్లు పనులను నిలిపేశారు. దీంతో పాత సమస్యలే విద్యార్థులకు స్వాగతం పలికాయి. గురువారం జిల్లా వ్యాప్తంగా పాఠశాలలను పున:ప్రారంభించినప్పటికీ నిర్మాణం మధ్యలో ఉన్న తరగతి గదులతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. పాత సమస్యలతోనే సతమతమయ్యారు. కొన్ని చోట్ల పనులు ప్రారంభం కాకపోగా ప్రారంభమైన చోట కూడా పూర్తి కాక అవస్థలు పడ్డారు.

మండలంలో 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 9 ప్రాథమికోన్నత పాఠశాలలు, 33 ప్రాథమిక పాఠశాలలు కలిపి మొత్తం 49 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటో తరగతి నుండి 10వ తరగతి వరకు 3,053 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే ఆయా పాఠశాలల్లో నాడు నేడు పనులతో అభివృద్ధి చేయాలని వైసిపి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పనులు ప్రారంభించనప్పటికీ నిధులు సకాలంలో రాక కొన్ని పాఠశాలల్లో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో తరగతి గదులు సరిపోక కొత్త విద్యా సంవత్సరంలోనూ విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

విద్యార్థులకు సమస్యలు స్వాగతం

వేసవి సెలవులు అనంతరం ప్రస్తుతం పాఠశాలలు పున: ప్రారంభమయ్యాయి. నాడు నేడు పేజ్ టు పనులు మాత్రం చాలా చోట్ల అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ముఖ్యంగా ఎం సీతారాంపురం, శివ్వాం పాఠశాలల్లో స్లాబ్‌లు వేసినప్పటికీ మిగతా పనులు చేయకపోవడంతో మధ్యలో నిలిచిపోయాయి. దీంతో తరగతి గదులు చాలక చాలా మంది విద్యార్థులు


పునాదులకే పరిమితమైన కొప్పర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం

అవస్థలు పడ్డారు. కొన్ని చోట్ల నిర్మాణంలో ఉన్న తరగతి గదుల్లోనే పాఠాలను చెప్పారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం ఏర్పడింది. నాడు నేడు పనులకు సంబంధించి ఏం చేస్తారన్నది వేచి చూడాలి. కొప్పర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పేజ్ టు పనులకు సంబంధించి వివరణ కోరగా పనులు చేపట్టాలని ఆదేశాలు వచ్చాయని తెలిపారు.


వంట గదులు లేక నిర్వాహకులు ఇబ్బందులు

మండలంలోని సంగాం, వంగర, ఎం సీతారాంపురం తదితర పాఠశాలల్లో వంట గదులు లేకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ ఎవరూ పట్టించుకోవటం లేదని మధ్యాహ్న భోజన నిర్వాహకులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి పాఠశాలల్లో వంట గదులు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

అసంపూర్తి భవనంలోనే చదువులు

వేపాడ: మండలంలోని దుంగాడ గిరిజన గ్రామంలోని ప్రాథమిక పాఠశాల నిర్మాణ అసంపూర్తిగానే ఉండిపోవడంతో ఆ పాఠశాలలోనే తరగతులను పున: ప్రారంభించారు. ఈ పాఠశాల నిర్మాణానికి రెండో విడత నాడు నేడు నిధులు మంజూరు చేసినప్పటికీ సకాలంలో నిధులు రాక నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. గదులు నిర్మాణం జరిగినప్పటికీ కిటికీలు, తలుపులు, మెట్లు, పెయింటింగ్స్ వేయవలసి ఉంది. ఈ నిర్మాణంపై ఎంఇఒ పి.బాల భాస్కరరావును వివరణ కోరగా సిమెంటుకు ఇండెంట్ పెట్టామని నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తి అయ్యే విధంగా చర్యలు చేపడతామని చెప్పారు.


నిర్మాణంలో ఉన్న గదిలోనే పాఠాలు


మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడును సత్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్

మాజీ మంత్రులను కలిసిన తాజా మంత్రి

ప్రజాశక్తి - గజపతినగరం

టిడిపి సీనియర్ మాజీ మంత్రులైన చింతకాయల అయ్యన్నపాత్రుడు, యనమల రామకృష్ణుడును అమరావతిలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఆయన తండ్రి మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కాసేపు రాజకీయాలపై చర్చించారు.


మస్తర్లను తనిఖీ చేస్తున్న ఎపిఒ ఆదిలక్ష్మి

ఉపాధి హామీ పనులు పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని జాకేరు గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎపిఒ ఆదిలక్ష్మి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వేతనదారులతో మాట్లాడుతూ తప్పనిసరిగా ప్రతి ఒక్కరు టైమ్‌కు రావాలని, అలా టైమ్‌కు రాకపోతే మస్తరు వేయకూడదని చెప్పారు. వేతన దారులపై క్షేత్ర సహాయకుడు పక్షపాతం వహిస్తే వెంటనే తనకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. పనికి తగ్గ వేతనం పొందాలంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ వేలకు వచ్చి పని చేయాలన్నారు.

చంద్రబాబుకు ధన్యవాదాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం మెగా డిఎస్‌సిపై తొలి సంతకం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షులు వేమలి చైతన్యబాబు ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వంలో ఎన్నో పోరాటాలు చేసినా, కనీసం చలనం లేకపోవడంతో జగన్మోహన్ రెడ్డి ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయలేదని పేర్కొన్నారు. ఈ తరుణంలో నిరుద్యోగులందరికీ అండగా ఉంటానని చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని తెలిపారు. 16,347 ఉపాధాయయ పోస్టుల భర్తీకి మొదటి సంతకం చేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు.

కెవిఆర్‌పై క్రిమినల్ కేసు పెట్టాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

జ్యూట్ కార్మికుల పిఎఫ్ బకాయిలు చెల్లించకుండా మోసం చేసిన శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు ఎండి కెవిఆర్‌పై క్రిమిన ల్ కేసు పెట్టాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, జిల్లా నాయకులు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరు లతో మాట్లాడు తూ జ్యూట్ కార్మికులకు బకా యిలు చెల్లించ ేందుకు 2019 డిసెంబర్ లో అప్పటి ఎమ్మెల్యే శంబంగి సమక్షంలో 2020 ఫిబ్రవరి నాటికి పూర్తిగా బకాయిలు చెల్లిస్తా మని ఒప్పందం జరిగినప్పటికీ నేటికి చెల్లించలే దన్నారు. కార్మికులకు పిఎఫ్ బకాయిలు చెల్లించక పోవడంతో 50ఏళ్లు దాటిన కార్మికు లకు పెన్షన్లు రావడం లేదన్నారు. జ్యూట్ మిల్లులో పని చేసిన కార్మికులు రోడ్డును పడిన గత


మాట్లాడుతున్న శంకరరావు, గోపాలం

పాలకులు పట్టించుకోలేదన్నారు. అనేక మంది కార్మికులు అనారోగ్యంతో మంచాన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. జ్యూట్ మిల్లు స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మే సిన యాజమాన్యం కార్మికులకు పిఎఫ్ బకా యిలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. కార్మికు లను మోసం చేసిన కెవిఆర్ పై క్రిమినల్ కేసు పెట్టి కఠిన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. కార్మికుల పోరా టానికి సిఐటియు మద్దతు ఇస్తుందన్నారు.

ఆర్‌డిఒ స్థల పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలం లోని పాటూరు గ్రామంలో సర్వే నెంబరు 84/2లో గల 5.69 ఎకరాల గొడ బంధ ఆక్రమునకు గురైందని పాటూరు గ్రామానికి చెందిన రుద్ర వెంకటలక్ష్మి హైకోర్టును ఆశ్రయించారు. స్పందించిన హైకోర్టు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ని ఆదేశించగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డిఒ సూర్యకుమారి క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆ భూమి ఇనాం భూమిగా రికార్డులలో ఉన్నట్లు గుర్తించామని, నివేదికను జిల్లా కలెక్టర్‌కి అందజేస్తానని ఆర్‌డిఒ తెలిపారు. ఉన్నతాధికారులు ఆదేశాలు వచ్చినంత ఆ భూముల్లో ఎటువంటి పనులూ చేపట్టకూడదని ఆదేశించారు. గతంలో ఇనాం భూముగా ఉన్న భూములు, జిరాయితీ భూములుగా ఎలా మార్పు చేస్తారని ఆర్‌డిఒ అసహనం వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో తహశీల్దార్ సత్యం, డిప్యూటీ తహశీల్దార్ సన్యాసినాయుడు, ఆర్‌ఐ రామలక్ష్మి, మండల సర్వేయర్ అప్పలనాయుడు, గ్రామ రెవెన్యూ అధికారి రాజు, సచివాలయ సర్వేయరు, హైకోర్టును ఆశ్రయించిన రుద్ర వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సూర్యకుమారి

నేడు పలు గ్రామాల్లో విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి- బాడంగి

మండల ంలోని గజరాయనివలస సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ కింద ఉన్న చెట్టు కొమ్మలు తొలగించే పనిలో భాగంగా శుక్రవారం విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతుందని ఎఇ శ్రీనివాస్ తెలిపారు. దీంతో ఎరుకులపాకలు, పెదపల్లి, తెంటువలస, పింద్రంగివలస, వీరసాగరం, డొంకినవలస రైల్వే స్టేషన్, డొంకినవలస విలేజ్, పిన్నవలస, కోడూరు, అచ్చియ్యపేట, గొల్లలపేట, బ్రమన్నవలస గ్రామాలకు ఉదయం 7 గంటలు నుంచి మధ్యాన్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వెల్లడించారు.

విద్యా కానుక కిట్లు పంపిణీ చేయండి : డిప్యూటీ డిఇఒ

ప్రజాశక్తి- మెరకముడిదాం

పాఠశాలలు పున: ప్రారంభమైన నేపథ్యంలో ప్రతి పాఠశాలకు విద్యార్థి కిట్లను పంపిణీ చేయాలని డిప్యూటీ డిఇఒ కె.మోహనరావు ఆదేశించారు. గురువారం స్థానిక మండల ఎంఆర్‌సి కార్యాలయంలో ఉన్న స్టాక్ పాయింట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు వాహనాలు ద్వారా కిట్లను తరలిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలానికి సంబంధించి 4,474 మంది విద్యార్థులకు కిట్లను సిద్ధం చేసామని, వాటిలో గర్భాం క్లస్టర్‌కు సంబంధించి స్టూడెంట్స్ కిట్లను వ్యాన్ ద్వారా పంపించామన్నారు. విద్యార్థులకు అందాల్సి కిట్లలో యూనిఫామ్ తప్ప మిగిలిన బ్యాగ్స్, బెల్టులు, షూలు,


వేపాడ: జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంఇఒ జగదీశ్వరరావు

పిక్టోరియల్ డిక్షనరీ, నోట్ బుక్స్, టెక్ట్స్ బుక్స్ అన్నింటినీ మండలంలో ఉన్న మొత్తం 73 పాఠశాలలకు పంపించామన్నారు. వీటిని త్వరలో విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 51,669 టెక్ట్స్ బుక్స్ మండలానికి రావలసి ఉండగా 35,905 మాత్రమే వచ్చాయని, ఇంకా 15,764 బుక్స్ రావలసి ఉందని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు చంద్రశేఖర్, ప్రసాదరావు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.


మెరకముడిదాం: పుస్తకాల తరలింపును పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ

పాఠశాలలకు విద్యా కిట్లు తరలింపు

వేపాడ: మండలంలో ప్రభుత్వ పాఠశాలలకు విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ప్రభుత్వం మంజూరు చేసిన విద్యార్థి కిట్లును మండల కేంద్రంలో గల స్టాక్ పాయింట్ నుంచి ఆయా పాఠశాలలకు వాహనాలు ద్వారా తరలించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు జగదీశ్వరరావు, బాల భాస్కరరావు, వేపాడ జెడ్‌పిహెచ్‌ఎస్ హెచ్‌ఎం వల్లి, సిఆర్‌పిలు, మండల కేంద్రంలో గల విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ పరిశీలన

నెల్లిమర్ల: స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల కిట్ల స్టాక్ పాయింట్‌ని రాష్ట్ర పరిశీలకులు కల్పన గురువారం పరిశీలించారు. విద్యాసంవత్సరం ప్రారంభం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కిట్లను పంపిణీ చేయనున్న నేపథ్యంలో ఆమె కిట్లను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా కిట్లు ఉండాలని, నాణ్యత కూడా ఉన్నవి పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం స్టాక్ రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఎంఒ ఆదినారాయణ, ఎంఇఒలు యుఎస్ఎన్ మూర్తి, ఈ విజయ్‌కుమార్, సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.


నెల్లిమర్ల: బ్యాగులను పరిశీలిస్తున్న కల్పన


బాడంగి: విద్యార్థులకు కిట్లను పంపిణీచేస్తున్న ఎంఇఒ

విద్యార్థులకు కిట్ల పంపిణీ

బాడంగి: గురువారం స్థానిక జెడ్‌పి పాఠశాలలో తరగతులు పున్న ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు కిట్లను ప్రధానోపాధ్యాయులు దత్తి సత్యనారాయణ, ఎంఇఒ-2 రాజేశ్వరి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కిట్స్‌లో ప్రధానంగా నోట్ పుస్తకాలు, టెక్ట్స్ బుక్స్ యూనిఫామ్, బ్యాగ్, షూ, సాక్షులు, బెల్టు ఉన్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ప్రశంసా పత్రాలను పంపిణీ చేస్తున్న సిఐ వెంకటరావు

ఎన్‌సిసి విద్యార్థుల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- విజయనగరం కోట

ఎన్‌సిసి విద్యార్థుల సేవలు అభినందనీయమని ఒకటో పట్టణ సిఐ బెండు వెంకటరావు అన్నారు. పట్టణంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల విధుల్లో సేవలందించిన ఎన్‌సిసి విద్యార్థులను ఆయన గురువారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోలింగు బూతుల వద్ద సేవలందించి, పోలీసులకు సహాయంగా విధులు నిర్వహించి, ఎన్నికలను ప్రశాంతయుతంగా నిర్వహించడంలో సహాయపడినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసులతో సమానంగా అంకితభావం, క్రమశిక్షణతో ఎన్నికల విధులు నిర్వహించారన్నారు. ఇదే రకమైన స్ఫూర్తి, క్రమశిక్షణను భవిష్యత్తులో కూడా కొనసాగించాలని కోరారు. ఇలా క్రమశిక్షణతో వ్యవహరించడం వల్ల తప్పనిసరిగా మీరు కోరుకున్న రంగంలో ఉన్నత స్థానానికి ఎదుగుతారనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. ఈ సమాజంలో భాధ్యత కలిగిన పౌరునిగా నిలుస్తారని, తద్వారా సమాజంలోని ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి ట్రైనర్ కళ్యాణ్ చక్రవర్తి, వన్ టౌన్ ఎస్‌ఐలు తారకేశ్వరరావు, ఎ.నరేష్, హరిబాబునాయుడు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కామాక్షి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని బొండాడవీధిలోగల మహాగణపతి కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి ఆలయ పంచమ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు అప్పలబత్తుల సోమరాజు పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాలకమండలి గౌరవాధ్యక్షులు లోకనాథ గణపతి, ఉపాధ్యక్షుడు కాకినాడ శశిభూషణరావు, అలమండ పాపయ్య శాస్త్రి, మందరపు వరహాచారి తదితరులు పాల్గొన్నారు.

సబ్ సెంటర్ల వద్ద మందులు ఉంచాలి

గుమ్మలక్ష్మీపురం: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మండలంలోని ఆరోగ్య ఉప కేంద్రాల వద్ద మలేరియా మందులు అందుబాటులో ఉంచేలా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని దుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతి కుమార్ కోరారు. ప్రస్తుతం గ్రామాల్లో మలేరియా జ్వరాలు ఎక్కువగా నమోదవుతున్నాయని, వైద్యం కోసం సబ్ సెంటర్ వద్దకు వెళ్తే ఇక్కడ మందుల్లేవని పిహెచ్‌సిలకు వెళ్లాలని వైద్య సిబ్బంది అంటున్నారని ఆయన తెలిపారు. దీంతో మలేరియా రోగులకు స్థానికంగా వైద్యమందని పరిస్థితి ఉందన్నారు. పది కిలోమీటర్ల దూరంలో ఉన్న పిహెచ్‌సిలకు రోగులు వెళ్లడం కష్టతరంగా ఉంటుందన్నారు. ఈ సమస్యపై అధికారులు స్పందించి సబ్ సెంటర్ల వద్ద మలేరియా మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.


శ్రీదేవికి పిహెచ్‌డి ప్రదానం చేస్తున్న విసి ప్రశాంత్ కుమార్ మహంతి

శ్రీదేవికి పిహెచ్‌డి ప్రదానం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయం సిఎస్‌ఇ విభాగం స్కాలర్ గద్దె శ్రీదేవికి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి గురువారం పిహెచ్‌డి ప్రదానం చేశారు. శ్రీదేవి చేసిన 'ఎ స్టడీ ఆన్ డ్రగ్ రెస్పాన్స్ అండ్ సెన్సిటివిటీ ప్రెడిక్షన్ ఆన్ కేన్సర్ ప్రొటీన్ యూజింగ్ రెగ్రెషన్ బేస్డ్ కన్వోల్యూషన్ నెట్ వర్క్స్ అండ్ కేన్సర్ డిసీజ్ క్లాసిఫికేషన్ యూజింగ్ ఫజ్జి సెట్స్' అనే పరిశోధన అంశానికిగాను ఈ అవార్డు లభించింది. డీన్ ప్రొఫెసర్ మురళీ పర్యవేక్షణలో ఈ పరిశోధన జరిగింది. రీసెర్చ్ డీన్ డాక్టర్ కె.విజయ్‌బాబు కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు ఆయనను అభినందించారు.

గురుకుల పాఠశాలల్లో సీట్లు పెంచాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఎపి గిరిజన సంక్షేమ గురుకులం బాలుర పాఠశాలలో సీట్లు పెంచాలని గిరిజన సంఘం, సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని కొమరాడ, భద్రగిరి, పి.కోనవలస గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకులం బాలురు పాఠశాలలో ఉన్నాయన్నారు.

వీటిలో ఒక్కొక్క స్కూల్లో సుమారు 480మంది విద్యార్థుల ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారన్నారు. వీటికి సంబంధించి ప్రతి ఏటా నాలుగో తరగతి చదివిన గిరిజన విద్యార్థులు ఐదో తరగతి ప్రవేశానికి గానూ పై తెలిపిన స్కూల్లో దరఖాస్తు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. అయితే వీటిలో 80 సీట్లు ప్రతి స్కూల్‌కు పరిమితమై ఉండగా అందులో 70 సీట్లు మాత్రమే గిరిజన విద్యార్థులకు ఉన్నాయని, మిగతా 10 సీట్లు బిసి జనరల్ కింద కేటాయిస్తామని తెలిపారు. ఇలాంటి సందర్భంలో ఈ ఏడాది విద్యార్థులు ఎక్కువగా ఉండడం వల్ల ఆయా స్కూల్‌కు వెళ్లినప్పుడు కూడా అక్కడ పరిమితం 70 సీట్లు మాత్రమే ఉన్నాయని, మిగతావి జనరల్ 10 సీట్లు మొత్తం 80 సీట్లు మాత్రమే అని అక్కడ ప్రిన్సిపల్ చెప్పారన్నారు. ఇలాంటి సందర్భంలో ఎంతో బాగా చదివిన విద్యార్థులు కూడా సీట్లు రాక చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఉందని ఉందన్నారు. కావున అధికారులు స్పందించి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో సీట్లు పెంపుదల చేసి గిరిజన విద్యార్థులకు భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రవి, వెంకట్రావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలే మిన్న

ప్రజాశక్తి - రామభద్రపురం

ప్రయివేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలే మిన్న అని, వీటికి ప్రత్యామ్నాయం వేరే ఏదీ లేదని నాయుడువలస పాఠశాల ఆంగ్ల భాష పాఠశాల సహాయకులు జెసి రాజు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో నైతిక, ప్రజాస్వామ్య విలువలు పెంపొందించేవి, మానవత్వాన్ని పరిమళింపజేసేవి, చదువుకున్న చదువును సమాజం హితం కోసం వినియోగించేలా చేసేవి ప్రభుత్వ పాఠశాలలేనని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో నే చేర్పించి కొనసాగించాలని కోరారు. గురువారం పాఠశాలలు పున్న ప్రారంభం సందర్భంగా విద్యార్థులతో కలిసి తల్లిదండ్రుల ఇళ్లను సందర్శించారు. పాఠశాలకు హాజరుకాని, కొత్తగా ప్రవేశం పొందుతున్న విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడారు. విద్యార్థి పరిపూర్ణ మూర్తిమత్వం కలిగిన వ్యక్తిగా భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడాలంటే పిల్లలను ప్రభుత్వ బడిలో చదివించాలని కోరారు. ఉపాద్యాయులు పాఠశాలలో బాధ్యతతో, చిత్తశుద్ధితో పని చేస్తున్నారని, నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కూడా విద్యార్థులకు అవసరమైన సామాగ్రితో విద్యా కిట్‌లను, పోషకాలతో కూడిన మధ్యాన్న భోజనం, డిజిటల్ విద్య సమకూరుస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న జెసి రాజు